# సమాచార కమిషన్‌లో తెలుగు వెలుగు

● నోటీసులు.. విచారణ నివేదికలు తెలుగులోనే

● మాతృభాషకు శ్రీకారం చుట్టిన స.హ. కమిషనర్

**హైదరాబాద్ సిటీ, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో తెలుగు భాష అమలుకు శ్రీకారం చుట్టారు రాష్ట్ర సమాచార కమిషనర్ బుద్దా మురళి. దరఖాస్తు దారులకు, ప్రభుత్వ పౌరసమాచార, అప్పీలు అధికారులకు విచారణకు హాజరు కావాల్సిందిగా పంపించే నోటీసులను తెలుగులోనే జారీ చేస్తున్నారు. కేసుల విచారణ పూర్తయిన అనంతరం జడ్జిమెంట్ నివేదికను సైతం దరఖాస్తు దారులకు, అధికారులకు తెలుగులోనే ఇస్తున్నారు. దీంతో వివిధ జిల్లాల నుంచి కమిషన్‌కు వస్తున్న దరఖాస్తుదారులు సమాచార కమిషనర్ ఇచ్చిన జడ్జిమెంట్ నివేదికలను పూర్తిగా అర్థం చేసుకునే వెసులుబాటు ఏర్పడింది.

## అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలయ్యేలా చూస్తాం



తెలంగాణ సమాచార కమిషన్‌లో బాధ్యతలు చేపట్టి రెండు నెలల పూర్తయింది. ఈ రెండు నెలల్లో కమిషన్‌లో కొన్ని మార్పులు చేశాం. ఇంకా చాలా మార్పులు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే కమిషన్ జారీ చేస్తున్న నోటీసులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కార్యాలయంలో సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలున్నాయి. త్వరలోనే వాటిని అధిగమించి పూర్తి స్థాయిలో తెలుగులోనే కార్యకలాపాలు కొనసాగిస్తాం. అంతేకాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో పౌర సమాచార అధికారులు దరఖాస్తుదారులకు సమాచారాన్ని స.హ.చట్టం సెక్షన్ 4(4) ప్రకారం తెలుగులోనే ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేస్తాం. విడతల వారీగా ప్రభుత్వ అధికారులకు, సామాన్య ప్రజలకు స.హ.చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

**- రాజా సదారాం, ప్రధాన సమాచార కమిషనర్**

## సెక్షన్ 4(4) ప్రకారం స్థానిక భాష అమలు చేయాలి...



దరఖాస్తుదారులు కోరిన సమాచారం కచ్చితంగా స్థానిక భాషలోనే ఇవ్వాలని స.హ. చట్టంలోని సెక్షన్ 4(4) నిబంధన స్పష్టంగా తెలియజేస్తుంది. కానీ సమాచార హక్కు చట్టం వచ్చి పుష్కర కాలం గడిచినా ఇప్పటి వరకు మండల స్థాయిలో కొన్ని కార్యాలయాలు మినహా ఎక్కడా ఆ నిబంధన అమలు కావడం లేదు. దీంతో ఈ చట్టంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగహన లేకుండా పోయింది. ఈ చట్టంపై పనిచేసిన ఉద్యమకారులు, ఉన్నత విద్యావంతులు, చట్టాల గురించి కొద్దోగొప్పో తెలిసిన వాళ్లకు మాత్రమే స.హ.చట్టంపై అవగాహన ఉంది అనడంలో అతిశయోక్తి లేదు. అందుకు కారణం మనం తయారు చేసుకున్న చట్టాలన్నీ ఆంగ్లంలో ఉండటమే. కాబట్టి ముందుగా సమాచార కమిషన్‌లో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు, తీర్పుల నివేదికలు తెలుగు భాషలో ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.

**- బుద్దా మురళి, రాష్ట్ర సమాచార కమిషనర్**